ఎమెస్కో

# వాల్మీకి



డా॥ భీమ్‌రావు గస్తీ

# వాల్మీకి

డా॥ భీమ్‌రావు గస్తీ

తెలుగు అనువాదం

శాఖమూరు రామగోపాల్

**వాల్మీకి**

**డా॥ భీమ్‌రావు గస్తీ**

అనువాదం: **శాఖమూరు రామగోపాల్**

ఇం. నెం. 5-10, రోడ్ నెం. 21,
దీప్తిశ్రీనగర్, మియాపూర్ పోస్ట్,
హైదరాబాద్ - 500 049
ఫోన్: 040-65520286
మొబైల్: 9052563666

© కమలా గస్తీ/Translator

డి.టి.పి.
శ్రీహరి

ముద్రణ
××××××

మూల్యం: రూ. 100/-

ప్రింటర్స్
××××××

**ప్రతులకు:**
శాఖమూరు రామగోపాల్
ఇం. నెం. 5-10, రెడ్ నెం. 21, దీప్తిశ్రీనగర్,
మియాపూర్ పోస్ట్, హైదరాబాద్ - 500 049.
ఫోన్: 040-65520286, మొబైల్ : 9052563666

**ప్రచురణ/పంపిణీదారులు:**
అభిజాత్య కన్నడ - తెలుగు భాషా (అనువాద) సంశోధన కేంద్రం (రిజిష్టర్డ్)
ఇం. నెం. 5-10, రెడ్ నెం. 21, దీప్తిశ్రీనగర్, మియాపూర్ పోస్ట్
హైదరాబాద్ - 500 049. ఫోన్: 040-65520286, సెల్ : 9052563666

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
**డాక్టర్ సి. నారాయణరెడ్డి** ఎక్స్ ఎం.పి.
ఎం.ఏ., పిహెచ్.డి., డి.లిట్.
అధ్యక్షులు
**ఆంధ్ర సారస్వత పరిషత్తు**
తిలక్ రోడ్డు, హైదరాబాద్ - 500 001.
ఫోన్ : (ఆ) 24753724

Jnanpith Awardee
**Dr. C. Narayana Reddy**
Ex. M.P.
M.A., Ph.D., D.Litt.
President
Andhra Saraswatha Parishath
Tilak Road, Hyderabad - 500 001.
Phone : (Off.) 24753724

నెం. ఆ.సా.ప/అధ్యక్షులు/2009-10/1403

తేది : 30-11-2009

# అభినందన

మరాఠీ ద్రావిడ భాషా కుటుంబంలోనిది కాకున్నా ప్రాదేశిక సాన్నిహిత్యం వల్ల కన్నడంతో చాలా దగ్గరి సంబంధం పెంచుకుంది. మాతృభాష మరాఠీ అయినప్పటికీ శ్రీ దత్తాత్రేయ రామచంద్ర బేంద్రె కన్నడంలో జ్ఞానపీఠ పురస్కారం అందుకున్నాడు. అలాగే కన్నడ మాతృభాషగా వున్న శ్రీ భీమారావుగస్తీ మరాఠీలో రచించిన 'వాల్మీకి' కృతి అత్యంత ప్రజాదరణ సంతరించుకుంది. భారతీయ భాషా రంగంలో వికసించిన విలక్షణ ఏకాత్మ భావనకిది ఉదాత్త ప్రతీక.

మౌలికంగా ఈ గ్రంథం భీమారావుగస్తీ ఆత్మకథైనా ఇందులో దళితులు, బడుగు ప్రజలు ప్రత్యేకించి బోయల జీవనశైలి, ఆచారవ్యవహారాలు, సంపన్న వర్గాల దమననీతి, అస్పృశ్యత, కార్మిక శ్రేయస్సు, సామాజిక సేవ, జోగినీల స్థితిగతులు, రాజకీయ పరిణామాలు ఇత్యాది అంశాలు కూడా భిన్న కోణాల్లో ఆవిష్కృతమయ్యాయి. తేదీల ప్రస్తావన లేకుండా రచన ఒకవిధంగా సార్వకాలీనత చేకూర్చుకుంది. కథనం నవల మాదిరి రూపుదిద్దుకుంది.

శ్రీ శాఖమూరు రామగోపాల్ తెలుగు అనువాదం యథామాతృకంగా సాగింది. మూలాన్ని విధేయంగా అనుసరిస్తూనే స్వతంత్ర రచన అనిపించే రీతిలో తెనిగించడం విశేషం. తెలుగు నుడికార సౌరభం ప్రతి పుటలోను గుబాళిస్తుంది. కొన్ని సంభాషణల్లో తెలంగాణా మాండలిక రూపాలను అనువాదంలో చక్కగా వాడుకున్నారు. సందర్భాన్ని బట్టి ప్రకరణం, అశిక్షితులు, అనుష్ఠానం, సంఘటించి, జనాంగం, సేవాక్షేత్రం, నిర్వాహకం మొదలైన ప్రౌఢ సమానార్థక ప్రయోగాలకు తావు కల్పించారు.

ఈ ఉత్తమానువాదాన్ని తెలుగు పాఠకలోకానికి అందించిన రామగోపాల్‌కు నా హార్దికాభినందనలు.

డా. సి. నారాయణరెడ్డి
*Signed*

# కొత్తరకం ఆత్మ కథ

డా॥ భీమ్‌రావు గస్తిగారు రాసిన ఆత్మకథ ఒక అద్భుత వ్యక్తి అద్భుత జీవితం గురించి చెప్పేది. ఆయన కర్నాటకలో పుట్టి, మరాఠీ భాషలో చదువుకొని, తన జీవిత చరిత్రను మరాఠీలో రాశాడు. ఈయన అతి నికృష్ట జీవితాన్ని అనుభవించిన ఒక బోయ కుటుంబంలో పుట్టి, ఆకలిమంటల మధ్య పెరిగి, వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజిలో B.E., చదివి, ఉస్మానియాలో M.E., మాస్కోలోని పాట్రిక్ లుముంబా యూనివర్సిటీలో Ph.D. చేశారు. ఆయన యవ్వన దశనాటికి అది అద్భుతమైన అచ్చీవ్‌మెంట్.

అయినా ఆ Ph.D.పట్టాతో ఉద్యోగం మొదలు పెట్టి, ఆ ఉద్యోగాన్ని వదిలి పెట్టి తన గ్రామస్థుల, కులస్థుల విముక్తి కోసం సామాజిక ఉద్యమాలు నడపడం మొదలెట్టాడు. తన యావజ్జీవితం అణగారిన కులాల విముక్తి కోసం కృషి చేశాడు. ఈ పుస్తకంలో ఆయన జీవితఘట్టాలను ఒక కథగా రాశాడు. ఆయన పుస్తకంలో వివరించిన సంఘటనలు చదువరులను ఎంతో ప్రభావితులను చేస్తాయి. ఆయన SC, BC ల ఐక్యత కోసం చాలా కృషి చేశాడు.

ఆయన చిన్న, చిన్న అంశాలను మొదలుకొని పెద్ద అంశాల వరకు స్వయంగా పట్టించుకొని చేసేవాడు. డా॥ భీమ్‌రావు గస్తీగారి జీవితచరిత్ర ఇప్పటికే మరాఠీ నుండి చాలా ఇతర భాషల్లోకి అనువదించబడింది.

ఈ పుస్తకాన్ని శాఖమూరు రామగోపాల్ గారు మొదటిసారి తెలుగులోకి అనువదించారు. రామగోపాల్‌గారికి గస్తీగారి మీద ఉన్న అభిమానం ముందు మాటలో చాలా స్పష్టంగా వ్యక్తమయింది.

దళిత బహుజన సాహిత్యం ఆత్మకథలలో ఈ మధ్య ప్రాచుర్యంలోకి వస్తోంది. పోతే ఆత్మకథ వారి జీవిత అనుభవాలను, పోరాటాలను పూర్తిగా చిత్రీకరించడానికి బాగా ఉపయోగపడుతుంది. తన సుదీర్ఘ జీవితంలో జరిగిన చాలా ఘట్టాలను ఆయన మన కండ్లకు కట్టినట్లు చూపించారు.

ఆయన మహాత్మా పూలే సాహిత్యం, ఉద్యమాల చరిత్రతో కొంత ప్రభావితుడైనట్లు మనకు ఈ పుస్తకంలో కనిపిస్తుంది. అదే సందర్భంలో ఆయనపై లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ వంటి సోషలిస్టు నేతల ప్రభావం కూడా ఉంది. గస్తీగారి ఈ జీవిత చరిత్రకు ఆయన వాల్మీకి అని పేరుపెట్టారు.

అయితే రామాయణం రాసిన వాల్మీకి బోయ కులస్థుడనే అభిప్రాయంలో ఆ పేరు పెట్టి ఉంటారు. వాల్మీకి నిజంగా బోయవాడైతే బ్రాహ్మణీయ కులవ్యవస్థను పటిష్టం చేసిన రామాయణాన్ని ఎందుకు రాసాడనే ప్రశ్న గస్తీగారికి తట్టిందో లేదో తెలియదు. ఈ పుస్తకం పేరు వాల్మీకి అని ఉన్నందువల్ల దీన్ని చదువరులు ఇది రామాయణ రచయిత వాల్మీకి జీవితచరిత్ర అనుకునే ప్రమాదం ఉంది. ఇది వాస్తవానికి గస్తీ గారి జీవిత చరిత్ర. అదీ చాలా వివరాలతో కూడిన చరిత్ర. ఇది చాలామందిని ఇన్‌స్పయిర్ చెయ్యగలదనే నమ్మకం నాకున్నది. ఈ పుస్తకం తెలుగులో మరు ముద్రణకు నోచుకొంటుంది నాకెంతో ఆనందంగా ఉంది.


**కంచ ఐలయ్య,**

డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్సు,

ఉస్మానియా యూనివర్శిటీ

హైదరాబాద్

# అనువాదికుడి మాట

2008న ఆరుకోట్ల కన్నడిగులలో శ్రేష్ఠ వ్యక్తిగా గుర్తించుకోబడి విశిష్ఠమైన పురస్కారంను పొందిన త్యాగశీలి: డాక్టర్ భీమరావ్ గస్తీగారి మరాఠి మూల ఆత్మకథకు తెలుగు అనువాదం ఈ పుస్తకం.

కర్నాటక – మహారాష్ట్రల సరిహద్దు భూభాగం చెంతన జనించిన డాక్టర్ భీమరావ్ గస్తీగారు ఓనామఃల నుంచి ఇంటర్ వరకు మరాఠి మాధ్యమంలో, ఆ మీదట 'ఒరుగల్లు' (వరంగల్)లోని ఆర్.ఇ.సి.లో బి.ఇ.ని మరియు ఎం.ఇ., పి.హెచ్‌డీను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పొంది కొద్ది కాలం హైదరాబాద్‌లోనే ఉద్యోగం చేసి, ఆ మీదట తన సమాజంకని సమాజ సేవలోనే తల్లీనుడైన వీరి ఆత్మకథ మరాఠి సాహిత్య లోకంలో పెను తుఫానునే సృష్టించినది. ఆ తదుపరి సుమారుగా 400 వందల దలితుల, బడుగు వర్గ శ్రేణుల నుంచి ఆత్మకథలకు ప్రేరణమైనది. గస్తీగారు అచ్చుకన్నడిగుడైనా, చదివింది మరాఠి మాధ్యమం అయినందున మరాఠి భాషలోనే తనురాసిన మూల ఆత్మకథ ప్రచురణమై ఆ తదుపరి అది ఎన్నో పునర్ ముద్రణలను పొందినది.

మరాఠి భాషలో రచించబడిన ఈ ఆత్మకథను డాక్టర్. సరజూ కాట్కర్‌గారు మరాఠి నుంచి కన్నడంలోకి అనువదించారు. డాక్టర్. కాట్కర్ గారు మరాఠి – కన్నడ భాషల నడుమ ఉన్న సంబంధ బాంధవ్యాలమీద డాక్టరేట్‌ను పొందిన ఘనాపాఠి అయినందున వారిచే అనువదించబడిన ఈ ఆత్మకథనుంచి గస్తీగారి ఘనత సమస్త కన్నడిగులకు తెలియటం; తద్వారా వారికి 2008లో శ్రేష్ఠ కన్నడిగుడిగా ప్రశస్థి పురస్కారం రావటం జరిగినది.

ఈ ఆత్మకథను తెలుగులోకి అనువాదం చేసేందుకని నేను గస్తీగారి స్వస్థలమైన బెల్గాంకు వెళ్ళి వారి ఆతిథ్యాన్ని పొంది తద్వారా సరజూ కాట్కర్‌గారిని కలిసింది మరియు గస్తీగారి కార్యక్షేత్రంలోని పలు ప్రాంతాలను సందర్శించినది అదొక మరుపురాని అనుభూతిగా నాకు మిగిలింది.

మరాఠి, కన్నడం, హిందీ, గుజరాతి భాషలలో ఈ ఆత్మకథ 'వాల్మీకి' అనే పేరుతో వచ్చినది మరియు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈ వాల్మీకి గ్రంథాన్ని

యూనివర్శిటీలలోని డిగ్రీ విద్యార్థులకు Non-Detailed Book గా పాఠ్యప్రణాళికలో చేర్చబడింది డాక్టర్ గస్తీగారి ద్వారా నా గమనంకు వచ్చినది.

ఈ ఆత్మకథ 97 దినములు కర్నాటకలో విశేష ఆధరణతో జనబాహుళ్యంలోకి చొచ్చుకుపోయిన 'కన్నడ ప్రభ' నుంచి ధారావాహికంగా ప్రచురణమైంది.

మూలతః తెలుగు భాషకుడినైన నాకు పూర్వపు నిజాం సంస్థానంలోని ఒక జిల్లా అయిన రాయచూరులో వంశపారంపర్య వ్యవసాయ భూములు ఉన్నందున ఆ భాషతో పరిచయం, మీదుమిక్కిలి దివంగతురాలైన నా మాతృమూర్తి అభిలాషనుంచి మరియు మా కుటుంబంకు ఈ ఆత్మకథలోని బోయ జనాంగంకు రైతు–కూలి నడుమున ఉ ండే సుమధుర సంబంధాలు ఉండటంతో శ్రద్ధతో యథాతథ అనువాదంను చేసినాను.

భూమిగె బిద్ద బీజ (భూమిలో పడిన బీజం)

ఎదెగె బిద్ద అక్షర... ఇందల్ల నాళె ఫలిత నీడుత్తదె (హృదయంలో నాటిన అక్షరం... ఈరోజు గాకపోయినా రేపైనా ఫలితంను ఇస్తదని ఎల్లవేళలా ఉద్బోధిస్తుండే దివంగతురాలైన మాతృమూర్తికి నివాళులు అర్పిస్తూ)

నిమ్మన్ను నెనెదరె ఉదయ (మిమ్మల్ని స్మరిస్తేనే ఉదయం)

నిమ్మన్ను మరెతరె అస్తమయ (మిమ్మల్ని మరిచితే అస్తమయం)

అనే నానుడి నుంచి మాతృమూర్తి అయిన మరియు రైతు మహిళైన శ్రీమతి శాఖమూరు కమలాదేవి గారిని పునఃస్మరించుకుంటూ వారి కుమారుడినైన (శాఖమూరు రామగోపాల్) నేను మరియు పరివారం...


శ్రీ శాఖమూరు రామగోపాల్ M.A.,

శ్రీమతి వనజా రామగోపాల్ M.Sc., M.Phil

కుమారి దివ్య రాణి B.Tech,

Value Lab

కుమారి దీప రాణి B.Tech

Accenture

కుమారి దేవకి రాణి B.Arch, 5th Year Student JNTU

KVPY Fellow

# వాల్మీకి

**కా**లిలో లోతుగా గుచ్చుకొన్న తుమ్మముల్లు బాధను పెట్టుంది. దాన్ని తీస్తేనే మాత్రం ఆ బాధ తగ్గుతది. మనస్సులో గడ్డ కట్టుకుపోయిన జ్ఞాపకాలు, అనుభవించిన దుఃఖాల పరిస్థితి కూడా అదే ఆ ముల్లు రీతిలోనే ఉంటది. మరణంను గుర్తుకు త్రెచ్చేటట్లుండే ఈ నా జ్ఞాపకాలు ఎంతో లోతులో నాటుకు పోయిన ముళ్ళులాగ వేదనలను కలిగిస్తున్నవి కదా..! స్నేహితులారా, చీము పట్టిన ముల్లులాగా బాధను పెట్టుండే ఈ వేదనల నోటికి సూదిని గుచ్చాల్సిందే. ఆ బాధలోని నాటిన ముల్లుకు ఉండే నోటిని తెరిచితే చీము మరియు రక్తం కారినా, ఈ సహింపలేని వేదనకు నోటిని విప్పాల్సే ఉందిలే.

నేను ఆరో లేక ఏడో సంవత్సరంలో ఉన్నప్పుడు, మా తాత చనిపోయాడు. అప్పటికి నేనింకా బడికి వెళ్ళలేదు. బడి పంతులు పిల్లల్ని కొడతాడని మరియు బోయ పిల్లల్ని మరింతగా చచ్చేటట్లు కొట్టాడని నమ్మిన మా తాత "మా అంతోళ్ళ పిల్లలకు అదెందుకు అవసరం ఇస్కూల్? మా వారసులు పాఠాల్ని నేర్చి కలెక్టర్లుగా అవుతారా?" అని అంటుండేవాడు. తాత చనిపోయిన మీదట నేను బడికి వెళ్ళలేదు. ఆరేడు సంవత్సరాలు మేము బోయోళ్ళ వాడలో మొండిమొలనే తిరుగుతుండేవాళ్ళం. సంవత్సరానికొకసారి మా ఊర్లో పీర్లపండుగ జరుగుతుండేది. అప్పుడు నాయన ఒక కొత్త చొక్కాను తెస్తుండేవాడు. పీర్ల పండుగరోజు పీర్ల దేవుడికి సాష్టాంగ నమస్కారం పెట్టించి, అక్కడే జళకం చేయించి అమ్మ నాకు ఆ కొత్త చొక్కాను తొడిగేది. ఒకసారి ఆ చొక్కాను అలాగునే తొడుక్కొనేది మొదలు అది చిరిగి పీలికలయ్యే వరకూ నా వంటి మీదే అది ఉంటుండేది. అది చీలికపీలికలుగా అయినదాన్ని చూసిన అమ్మ "బొంత కుట్టేందుకు కావాలి బిడ్డా" అంటూ బలవంతంగా నా చొక్కాను గుంజుకొనేది. మరలా ముందొచ్చే పీర్లతాత పండగ వరకూ దిగంబరంగానే నేను తిరుగుతుండేటోడ్ని.

ఒకరోజు ఉదయం వేళలో మా బోయోళ్ళ వాడకు పంతులు వచ్చాడు. నన్ను చూసినంతనే అక్కడ నిల్చిన ఒకడితో...

"ఎవరి పోరడు వీడు?" అని అడిగాడు.

"బశాణి కొడుకండి"

"ఏ బశాణి?"

"అక్కడ పైన ఉంటాడు కదా, ధానప్ప బశాణి"

వాళ్ళ మాటల్ని విన్న నేను భయపడ్డాను. ఇంటివైపుకు వాయువేగంగా పరిగెత్తి ఇంటిలోపల దాక్కొన్నాను. నా వెనక నుంచే అయ్యవారు మా ఇంటికి రానే వచ్చాడు. అతడ్ని చూసి మా నాయన భయపడ్డాడు. అయినా పంతుల్ని కూర్చోమని గొంగడ్ని పరిచాడు. నేను తలుపు సంధుల నుంచి చూడసాగాను.

"ధానప్ప బశాణి... నీకొడుకు పెద్దోడైయ్యాడు. ఆ పోరడ్ని బడికి పంపించు" అన్నాడు పంతులు.

"ఇంకా చిన్నపోరడే కదా" నాయన బదులిచ్చాడు.

"అదెంత చిన్నపోరడు? ఏడు సంవత్సరాలు నిండియుండొచ్చు"

"కావొచ్చు; కావొచ్చు"

"మరి అతడ్ని బడికి పంపాలి కదా..? పంపకపోతే గవర్నమెంట్ దండం (జుల్మానా) విధిస్తది" అన్నాడు కోపంగా పంతులు.

దండం (జుల్మానా) శబ్దాన్ని విన్న నాయన ముఖం వివర్ణమైంది. నాయన 'హు' అన్నట్లుగా చిన్నగా పలికాడు. పంతులు వెళ్ళిపోయిన పిమ్మట అమ్మ దగ్గరికి వచ్చి 'రేపట్నుంచి వీడ్ని బడికి పంపమని పంతులు ఆజ్ఞ చేసాడు' అని అన్నాడు నాయన. అమ్మ పొయ్యి ముందు కూర్చుని ఉంది. పొయ్యిలోకి చిన్న కట్టె ముక్కల్ని నెట్టూ 'ఉండేదే ఒక పిల్లోడు. ఆ పంతులు బాగా కొడ్తాడట; నా బిడ్డ ఉత్త పుణ్యానికే చనిపోతాడు' అని బదులిచ్చింది. నేను ఆ ఇద్దరి ముఖాల్ని చూస్తూ ఉన్నాను. మరలా నాయనే 'ఏదో ఒకటి కానీయ్..; మొదలు బడికి పంపుదాం..; ఒకట్రెండు తరగతులైనా చదవనీ' అన్నాడు సానునయంగా. అమ్మ ఏమి మాట్లాడలేదు. మా బోయోళ్ళవాడలో ఐదారుగురు పిల్లలు బడికి వెళ్తున్నారు. వాళ్ళ జతగా నేనూ బడికి వెళ్ళొచ్చని సంతోషమైంది. అయితే పంతులు కొట్టే పేము బెత్తం దెబ్బల్ని నేను ఊహించుకొన్నా; వంటిమీద ముళ్ళు గుచ్చుకొన్నట్లుగా భయపడ్డాను.

అమ్మ శనివారం నాడు జరిగే సంతకు వెళ్ళివచ్చింది. ఆమె బుట్టలో బజ్జీల పొట్లం ఒకటుంది. దాన్ని ఫకి తీసుకుంది. దాన్ని గుంజుకొని నేను బయటకు పరిగెత్తాను. 'నా పొట్లం గుంజుకొని అన్న పారిపోయాడు' అంటూ ఫకి ఏడ్వసాగింది. అప్పుడు అమ్మ 'బుట్టలో పలక ఉంది; దాన్ని బయట పెట్టు' అని నాతో అంది. నాచేతిలో ఉన్న బజ్జీల పొట్లంను చెల్లెలికి ఇచ్చాను. బుట్టలో ఉన్న పలకను నిధానంగా చేతిలో పెట్టుకొని పైకెత్తాను. పీర్లపండగలో కొత్త చొక్కాను చూసినట్లుగా సంతోషమైంది నాకు ఆ పలక నుంచి. చెల్లెలు బజ్జీల్ని తింటుంది. పలకను చూసిన నాకు పొట్ట నిండినట్లైంది. రాత్రి పడుకొన్నప్పుడు పలకను పొట్టకు ఆనించుకొనే పడుకొన్నాను. అర్ధరాత్రిలో పలక నా ప్రక్కలోనే ఉందో లేదో అనేదాన్ని మరలా మరలా చూసి ఖాయపరుచుకోసాగాను. దాన్ని ముట్టుకొంటూ ఒత్తుకొంటూ ఎప్పుడు నిద్రలోకి జారానో గుర్తేలేదు.

– 2 –

మరునాడు మెలకువ వచ్చి లేచినప్పుడు ఇంటిమీద కాకులు 'కావ్ కావ్' అంటూ అరుస్తున్నవి. అమ్మ తొట్టిలో నీళ్ళను నింపుతుంది. నాయన ఎప్పుడు మేల్కొని గుట్టకు వెళ్ళాడో తెల్వదు. నేను లేచి వంటి మీదున్న బొంతను పక్కకు నెట్టాను. అప్పటికప్పుడే ఒక్కసారిగా పలక గుర్తుకొచ్చింది. ప్రక్కన చూస్తే పలక అదృశ్యమై ఉంది. భయంగా పడుకొన్న ప్రక్కను వెతికాను. అక్కడెక్కడా పలక కనబడలేదు. బయటకు వచ్చి చూస్తే అరుగుమీద అక్క మరియు చెల్లెలు పలకను పట్టుకొని కూర్చుని ఉన్నారు. కోపంతో ముందుకొచ్చి పలకను లాక్కొనేందుకు ప్రయత్నించాను. వాళ్ళిద్దరూ ఒక ప్రక్కన చేరి దాన్ని లాగసాగారు. ముగ్గురమూ లాక్కొనేది చేస్తుండగా పలక అరుగుమీద పడి పగిలిపోయింది. 'నా కొత్త పలక పగిలిందని' నేను జోరు జోరుగా ఏడ్వసాగాను. అంతలో అక్కడికి వచ్చిన అమ్మ పగిలిపోయిన పలకను చూసి, దాన్ని నేనే పగలగొట్టానని నన్ను బాధసాగింది. పలక పగిలిందని ఒక ప్రక్కన దుఃఖం వస్తుంటే, అమ్మ నుంచి వస్తున్న గుద్దులు మూలాన ఇంకొక వైపున దుఃఖం వచ్చి నేను మరలా జోరుగా ఏడ్వసాగాను. అప్పుడు అక్కడే ఉన్న లగమ్యా 'పలకను అతను పగలగొట్టలేదు; అక్క మరియు ఫకి పగలగొట్టారు' అని చెప్పాడు. దీన్ని విన్న అమ్మ నన్ను గుద్దేది ఆపి వాళ్ళిద్దర్ని బాధసాగింది. పగిలిపోయిన పలకను ఎత్తుకొని నేను ఎంతోసేపు ఏడుస్తూ కూర్చుండిపోయాను.

మరుసటి రోజున పరాశ్య మరియు లగమ్యా జతగా నేనూ బడికి వెళ్ళాను. బడి పెద్ద మిద్దెలో నడుస్తుంది. మిద్దె లోపల హనుమంతుడి గుడి ఉంది. మిద్దెలో ఉన్న అరుగుమీద అయ్యవారుకు చెందిన టేబుల్–కుర్చీ ఉంది. గోడకు వేలాడదీసిన పెద్ద నల్లటి బోర్డ్ ఒకటి ఉంది. పైనున్న అరుగుమీద సవర్ణీయుల (పెద్ద కులపోళ్ళ) పిల్లలు కూర్చుంటే, క్రిందున్న నేల మీద మేము ఐదారుగురు బోయ పిల్లలం కూర్చునియున్నాము. పైన కూర్చున్న పిల్లలు బిగ్గరగా ఏమిటో చదువుతున్నారు. కొంతమంది పిల్లల చేతిని పట్టుకొని అయ్యవారు అక్షరాల్ని దిద్దిస్తున్నాడు. కొంతమంది పిల్లలు పలకలమీద దృష్టి పెట్టి తామే అక్షరాల్ని దిద్దుతున్నారు. పరాశ్య కూడా పలకమీద రాస్తున్నాడు. నేను దొంగ చూపులనుంచి అందర్నీ చూస్తున్నాను. నామీద ఎవరి గమనమూ లేదు. మధ్యాహ్నంలో తిండిని తినేందుకని బడిని వదిలే సమయమైనప్పుడు అయ్యవారు నా వైపుకు చూసాడు. నా ప్రక్కన పరశ్యా కూర్చున్నాడు. అతను రెండో తరగతిని చదువుతున్నాడు. అతడ్ని ఉద్దేశించి అయ్యవారు “ఒరేయ్ పరశ్యా, అతనికి ‘అఆలను’ రాసి ఇవ్వరో” అని ఆదేశించారు. పరశ్యా నాలోని పగిలిన పలకను తీసుకొని దాని మూలలో అఆలను రాసి వాట్ని దిద్దమని చెప్పాడు. నేను మరలా భయపడ్డాను. కళ్ళు నీటితో నిండినవి. దాన్ని చూసిన పరశ్యా నా చేతిని పట్టుకొని అక్షరాల్ని ఎలాగున దిద్దాలి అని తెల్పాడు. నేను భయపడ్తూ భయపడ్తూ అఆలను దిద్దసాగాను. బడి వేళ అయిపోయే వరకూ నేను అఆలను దిద్దసాగాను. ఆ తర్వాత ఏడెనిమిది రోజుల వరకూ నేను అఆలను దిద్దాను.

రెండుమూడు నెలలైన మీదట నాకు మిగిలిన అక్షరాలు రాసేది వచ్చింది. నేను ప్రతిదినం బడికి వెళ్తున్నాను. ఎప్పుడైనా ఒకరోజు బడి ఎగ్గొట్టితే, మిగిలిన పిల్లలు మా ఇంటికొచ్చి నన్ను ‘బరబరా’ లాక్కొంటూ బడిలో వదుల్తుండేవారు. ఒకొకసారి నన్ను ఎత్తుకొని వచ్చి పేడతట్టను తిప్పగుంటలోకి విసిరినట్లుగా అయ్యవారుకు ఎదురుగా విసిరేసేవాళ్ళు. అప్పుడు అయ్యవారు పరశ్యాతో నామీద ఐదారు గుద్దుల్ని గుద్దమని చెపుతుండేవారు. నా జాతోడే అయిన పరశ్యా నన్ను చట్నీని రోట్లో నూరినట్లుగా కొట్టుండేవాడు. కొట్టేటప్పుడు నేను ఏడుస్తుంటే అతను ఖుషీతో కేకల్ని పెట్టుండేవాడు. రాగారాగా బడి నాకు ఇష్టం గాసాగింది. ప్రతిరోజూ బడికి వెళ్తుండేవాడ్ని. అభ్యాసంనూ చేయసాగాను. ఒకటో తరగతిని పాసు అయ్యాను.

మిద్దె పైభాగంలో హనుమంతుడి గుడి ఉంది. పెద్దకులపోళ్ళ పిల్లలు గుడిలోపలికి వెళ్ళి హనుమంతుడికి నమస్కరిస్తే, మేము క్రిందున్న అరుగుమీద నిల్చి చేతుల్ని

జోడిస్తుండేవాళ్ళం. బోయోళ్ళు ఆవుల, బర్రెల, దూడల మాంసంను తింటుంటారని, అందుచేత మాకు పైనున్న అరుగును ఎక్కేది నిషిద్ధంగా ఉంది. పెద్ద కులపోళ్ళు (సవర్ణీయులు) గుడికి వస్తుండేవారు. ఒక చేతిలో నూనె సీసాల్ని మరొక చేతిలో ఊదుకడ్డీల్ని (అగరబత్తులు) పట్టుకొని వాళ్ళు గుడిలోకి ప్రవేశిస్తుండేవారు. లోపలికి వెళ్ళేటప్పుడు మమ్మల్ని తొక్కుతుండేవారు. మా పలకల్ని పగులగొట్టేవారు. మమ్మల్ని తిట్టేవారు. 'జరగండ్రో బోయ కొడుకుల్లారా' అని గదిరిస్తుండేవారు. 'ఏమండి అయ్యవారు.. వీళ్ళకు సొక్కు (గర్వం) వచ్చింది; ఐదారు వేట్లను వేయండి' అని పంతులుగారితో అంటుండేవారు.

సోమవారం వచ్చిందంటే, అయ్యవారు మమ్మల్ని హెచ్చరిస్తూ 'మాంసంను తిని బడికి రాకండ్రో' అని చెపుతుండేవారు. మాకంటూ స్నానం చేసే పద్దతే లేదు. 'స్నానం చేసి వచ్చామని' అబద్దాల్ని చెప్పినా అయ్యవారు మమ్మల్ని కొట్టూనే ఉండేవారు. నేను మూడో తరగతిలో ఉన్నప్పుడు అంతింతగా జ్ఞానం రాసాగింది. గుడికి వెళ్ళేటప్పుడు మాంసం తినగూడదని, తింటే అయ్యవారు కొట్తారని అర్థమైంది. అయ్యవారి నుంచి వేటును తప్పించుకోవాలంటే మాంసం తినగూడదని నిర్ణయించుకొన్నాను.

-3-

ఒకరోజు ఇంట్లో మాసం వండారు. నేను అమ్మతో నా నిర్ణయం చెప్పాను. అమ్మ 'మాంసం తినకపోతే నిన్ను వామనాచారిగా పిలుస్త్రారా? నోర్మూసుకొని తిను' అంటూ గదిరింది.

నేను తినలేదు. ఆ రోజున భోంచేయలేదు. ఇలాగున ఐదారుసార్లు అయ్యింది. అప్పటి నుంచి అమ్మ నాకోసమని ఒకింతగా అన్నాన్ని వేరేగా వండి వార్చింది. పీర్ల తాత పండగ కాలంలోనూ నేను మాంసం తినలేదు. నేను మాంసం తినేదాన్ని వదిలేసినా అయ్యవారు కొట్టేదాన్ని ఆపలేదు. 'నేను మాంసం తినటంలేదు' అని చెప్తున్నా వారు నన్ను దండిస్తూనే ఉండేవారు. నోరు తెరిస్తే మరలా వేట్లు పడుతుండేవి.

మా ఇంట్లో స్నానం చేసేందుకు ఏ వ్యవస్థ లేదు. నేను మరియు నలుగురైదుగురు బోయ పిల్లలం ప్రతి ఆదివారం ఊరుకు ప్రక్కన ఉండే చెఱువు వద్దకు స్నానంకని వెళ్ళేదాన్ని చేయసాగాము. చొక్కా, లాగులను విప్పి గట్టుమీద వాట్ని పెట్టి మేము చెఱువులో ఈతకొట్టుండేవాళ్ళం. ఒకట్రెండు గంటలైనా అక్కడే ఈతగొట్టి పైకి

వస్తుండేవాళ్ళం. చెఱువు ప్రక్కనే పెద్ద కులపోళ్ళ పొలం ఉంది. అక్కడ చింతచెట్లు ఎన్నో ఉన్నవి. చెట్టు ఎక్కి కావాల్సినన్ని చింతకాయల్ని తెంపుతుండేవాళ్ళం. ఒక్కొక్క సారి ఆరైతు మమ్మల్ని పట్టుకొంటుండేవాడు. అతని మనస్సుకు తృప్తి అయ్యే వరకూ మమ్మల్ని చితకగొట్టేవాడు. అంతైనా, అతని కళ్ళను తప్పించి మేము చెట్లను ఎక్కుతుండేవాళ్ళం. అతను వస్తుండేదాన్ని దూరం నుంచే చూసి, చెట్టునుంచి క్రిందకు దూకి పరారౌతుండేవాళ్ళం.

మాకు గుణపాఠం నేర్పేందుకు అతను నిశ్చయించుకొని యుండొచ్చు. ఒక రోజు అతను కొన్ని పచ్చి తుమ్మ మండల్ని (కొమ్మల్ని) చెఱువులో పడేసాడు. అవి నీట్లో మునిగి ఉన్నవి. పైకి కనబడుటలేదు. నీళ్ళ అడుగున తుమ్మ మండలు ఉన్నవనే కల్పనా మాలో లేదు. యథాప్రకారంగా బట్టల్ని విప్పి నీళ్ళలో దూకాము. మేము నీళ్ళలో దూకిన తక్షణమే ఆ తుమ్మ మండలలో వలలో పడిన చేపలలాగ చిక్కుబడిపోయాము. ముళ్ళు శరీరమంతా గుచ్చుకొన్నవి. భరింపలేని వేదన కలగసాగింది. మేమందరం జోరుగా (బిగ్గరగా) ఏడ్వసాగాము. మా ఏడుపుల్ని విని అక్కడే చుట్టుప్రక్కల పశువుల్ని మేపుతున్న బోయోళ్ళు పరుగు పరుగున వచ్చారు. వాళ్ళకు పరిస్థితి అర్థమైంది. ఎంతో జాగ్రత్తలతో చెఱువులోకి దిగి మమ్మల్నందర్నీ చెఱువు నుంచి బయటకు లాగారు. మాకెవరికీ నడిచేందుకు కుదరట్లేదు. కాళ్ళు, చేతులు, పొట్ట, తల... ఇలాగున దేహంలో ముళ్ళు గుచ్చుకుపోయినవి. మా అందరి దేహాల నుంచి రక్తం కారుతుంది. మేమందరం 'అయ్యో అమ్మో' అంటూ ఏడుస్తున్నాము. ఇంట్లోకి వచ్చాక నా ఏడుపును చూసి కనికరం చూపకనే ఇంట్లో వాళ్ళు నన్ను తిట్టసాగారు. నాయనమ్మ మాత్రం నన్ను దగ్గరకు పిల్చుకొని, నాశరీరంలో గుచ్చుకొన్న ముళ్ళను బయటకు తీయసాగింది. కాళ్ళలో నాటిన ముల్లంటూ బాగా లోపలికే దిగిపోయినట్లుగా ఉంది. కొన్ని ముళ్ళు లోలోపల విరిగిపోయి ఉన్నవి. నాయనమ్మ ఒక దబ్బనం తెచ్చి దాని సహాయంతో ముళ్ళను తీయసాగింది. నేను వేదన నుంచి విలవిలలాడుతున్నాను. 'మాదిగోళ్ళ ఇళ్ళవైపుకు ముఖం పెట్టుకొని నోరు వెళ్ళబెట్టి కూర్చో; బాధ తగ్గిపోతది' అంది నాయనమ్మ. తర్వాత రక్తం తుడిచి ఏవో ఆకులను (జిల్లేడు పాలను పూసి) తెచ్చి కట్టింది. మిగిలిన పోరల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. ముళ్ళునాటి రక్తం వస్తున్నా ఎవర్నుంచి సానుభూతి రావట్లేదు. బదులుగా 'అక్కడికి ఎందుకు వెళ్ళారు' అంటూ బోయవాడలోని జనమంతా తిట్టసాగారు. మా వెన్నుల మీద కనికరంతో చేతిని పెట్టి నిమిరే బదులుగా అందరూ మా వీపుల మీదే గుద్దసాగారు. 'ఇంకొకసారి అక్కడికి వెళ్తే చూడు' అంటూ బెదిరిస్తున్నారు.

**End of Preview.**

**Rest of the book can be read @**

http://kinige.com/kbook.php?id=176